అర్ధాకలితో ఆటోవాలా

- స్త్రీశక్తి పథకంతో సంక్షోభంలో ఆటో కార్మికులు
- రోజుకు రెండు, మూడు వందలకే పరిమితమైన సంపాదన
- లబోదిబోమంటున్న ఆటో డ్రైవర్లు
- ఆటో కార్మికులకు రూ. 25వేలు ఇవ్వాలని డిమాండ్



ఆటో స్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం తమ కడుపు కొట్టిందని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయి. ఇప్పటి వరకు ఉద్యోగాలు రాకపోయినా ఒకరిపై ఆధారపడకుండా ఆటో నడుపుతూ స్వయం శక్తితో గౌరవంగా జీవిస్తున్నారు. డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్ చదువుకున్న వారు సైతం చదివిన చదువులకు తగిన ఉద్యోగాలు, ఉపాధి లేకపోవడంతో స్వయం ఉపాధిగా ఆటోలు నడుపుకొంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాహన మిత్ర పథకం అందించడం ద్వారా ఆటో కార్మికులకు అండగా నిలిచింది. ఆటో కార్మికులు సంఘంలో గౌరవంగా జీవించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సహకరించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటో కార్మికుల జీవన పరిస్థితులు దిగజారిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెంట్రల్‌లో 5 వేల మంది ఆటో కార్మికులు

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సుమారు నాలుగు నుంచి ఐదు వేల మంది ఆటోలు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు. వీరు రోజుకు ఆటోలను నడపడం ద్వారా వెయ్యి రూపాయల వరకు సంపాదించేవారు. వచ్చిన సంపాదనతో సమాజంలో గౌరవంగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఓలా, ఉబర్, ర్యాపిడో సంస్థలు రంగ ప్రవేశం చేశాయి. దీంతో ఆటో డ్రైవర్ల సంపాదన తగ్గిపోయింది. వచ్చే అరకొర సంపాదనతో బతుకు జీవుడా అని జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులపై స్త్రీశక్తి పథకం పిడుగులా పడింది. స్త్రీశక్తి పథకం అమలుతో ఆదాయం కేవలం రెండు నుంచి మూడు వందలకే తమ సంపాదన పరిమితం అయ్యిందని ఆటో కార్మికులు వాపోతున్నారు. వచ్చిన సంపాదనతో ఇంటి అద్దెలు, ఖర్చులు సరిపోక నానాయాతన పడుతున్నారు.

రూ. 25వేలు ఇవ్వాలి



స్త్రీశక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆటో కార్మికులకు రూ. 25వేలు ఇవ్వాలి. ఆటోల ద్వారా వచ్చే ఆదాయం కనీస ఖర్చులకు కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. అలాగే జీఓ నంబర్ 21 రద్దు చేయాలి.

ఏవీ రెడ్డి, ఆటో డ్రైవర్

ఆటో కార్మికులను ఆదుకోవాలి



సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటోకార్మికులను ఆదుకోవాలి. ఆటో డ్రైవర్లకు ఇబ్బందికరంగా మారిన జీఓ నెంబర్ 21ను రద్దు చేయాలి. ఉచిత బస్సు కారణంగా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఎటువంటి నష్టపరిహారం ప్రకటించకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు.

కె. దుర్గారావు, సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

హామీలు అమలు చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో, మోటారు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఇప్పటికే ఉబర్, ఓలా, ర్యాపిడోలతో ఆటో కార్మికులకు తగినంత ఆదాయం లేక అవస్థలు పడుతున్నారు. ఈ సమయంలో స్త్రీశక్తి పథకం రావడం మూలిగే నక్కపై తాటి కాయ పడిన చందంగా మారింది.

ఎం.హనుమంతరావు, ఆటో డ్రైవర్

క్లుప్తంగా

నేడు వీఎంసీలో పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు వీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌తోపాటు వీఎంసీ సర్కిల్ కార్యాలయాల్లోనూ జరుగుతుందన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలో సర్కిల్–2లో, పటమటలోని సర్కిల్–3లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకొచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా వెంకయ్యస్వామి దివ్య ఆరాధన ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ కొబ్బరితోటలో ఆదివారం శ్రీభగవాన్ వెంకయ్యస్వామి దివ్య ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భగవాన్ వెంకయ్యస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వెంకయ్యస్వామి పారాయణం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మధ్యాహ్నం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో సెంట్రల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, పీపీఆర్ స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

28న శ్రీసుబ్రహ్మణ్య సంగీత సమితి వార్షికోత్సవం


విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో శ్రీసుబ్రహ్మణ్య సంగీత సమితి 10 వార్షికోత్సవాలను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సీవీ రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విఖ్యాత సంగీత విద్వాంసులు ధూళిపాల శ్రీనివాస్ వీణా వాద్య కచేరీ, హెచ్ఎన్ కార్తీక్ వయోలిన్, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగంపై, ఎస్.కార్తీక్ ఘటంపై సహకరిస్తారని తెలిపారు.

రోడ్డుపై వ్యర్థాల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల బుడమేరులో తొలగించిన వ్యర్థాలను రోడ్డుపై వేశారు. రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో రోడ్డుపై ఉన్న చెత్తచెదారం, వ్యర్థాలను ఆదివారం జేసీబీ, ట్రాక్టర్‌లతో తొలగించారు. అయితే ఇక్కడ చెత్త తరలింపు పనులు వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. సాధ్యమైనంత త్వరగా వ్యర్థాలను పూర్తిగా తొలగించి రోగాల బారినపడకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జానపద కళలను పరిరక్షించుకోవాలి



విజయవాడ కల్చరల్: జానపద కళలను పరిరక్షించుకోవాలని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. దామోదర జానపదం, దేశికా ఆర్ట్స్, మామ్ ట్రస్ట్, లోక కళాపరిషత్ ఆధ్వర్యాన అంతర్జాతీయ జానపద దినోత్సవం సందర్భంగా ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జానపదం, ఆట–పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ జానపద గీతాలు తెలుగు వారి ఆత్మ అని అభివర్ణించారు. జనుల హృదయాన్ని కదిలించేది జానపదమని తెలిపారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ జానపదం జనపదం అని అభివర్ణించారు. గాయకులు పలు జానపద గీతాలను ఆలపించారు. అనంతరం వేముల హజరత్తయ్య గుప్తా, సునీల్‌కుమార్, భారతి, రమణ, ఎస్. కృష్ణవేణి, రెడ్డి ప్రసాద్, బండి ఉషారాణి, పి.వెంకటరమణ, వైష్ణవి, అత్తలూరి విజయలక్ష్మి తదితరులకు కృష్ణవేణి జానపద సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, బొండా జగన్మోహనరావు, మాసాబత్తుల శ్రీనివాస్, మహంతి వాసుదేవరావు, లింగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంగా విగ్రహాలను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా విగ్రహాలకు అవమానం జరిగితే కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలోని కలిదిండి సానారుద్రవరం గ్రామంలో వంగవీటి మోహన రంగా విగ్రహాలకు దుండగులు పేడ పూసి అవమానించిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. కానీ ఇంతవరకు పోలీసులు ఆ దుండగులను పట్టుకోలేకపోవడం విడ్డూరమన్నారు. ప్రభుత్వ అలసత్వానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఎక్కడికక్కడ అవమానిస్తున్నారని మండిపడ్డారు. అలాగే 2017లో టీడీపీ ప్రభుత్వంలో కూడా సింగ్‌నగర్ ఫైవుల రోడ్డులోని రంగా విగ్రహాన్ని ధ్వంసం చేశారని గుర్తుచేశారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని నొక్కివక్కాణించారు. వంగవీటి మోహన రంగాను ఈ ప్రభుత్వం గౌరవించిన దాఖలాలు ఎక్కడా లేవని విమర్శించారు. జులై 4న వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా ప్రభుత్వ పెద్దలు ఆయనకు నివాళులర్పించిన పరిస్థితులు కూడా ఎక్కడ కనపడలేదని పేర్కొన్నారు. కాబట్టి ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వంగవీటి మోహన రంగాకు అవమానం జరిగితే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

బుడమేరు కన్నీటి కష్టాలకు 'సంవత్సరీకం'

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు నివారణకు ఏడాది కాలంలో కేటాయించిన నిధులు, చేపట్టిన పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడారు. గతేడాది ఆగస్టు 31, సెప్టెంబర్ ఒకటో తేదీన బుడమేరు వరదలతో విజయవాడ నగరంలోని లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారని, నరకయాతన అనుభవించారని గుర్తు చేశారు. నాడు ముందస్తు హెచ్చరికలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. దాదాపు 50 మంది మరణించారని, రూ.వేల కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. విజయవాడ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ప్రజల జీవితాలు అతలాకుతులం అయ్యాయని పేర్కొన్నారు. ఆ దెబ్బ నుంచి ప్రజలు నేటికీ పూర్తిగా కోలుకోలేదన్నారు. వరదల సమయంలో హడావిడి చేసిన సీఎం చంద్రబాబు బుడమేరు ముంపు ప్రమాదం నుంచి ప్రజలను కాపాడే చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. ఏడాది కాలంలో రూ.30 కోట్ల ఖర్చుతో ఒకచోట గండి పూడ్చి, గోడ నిర్మించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. నష్టపోయిన బాధితులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలు, కార్మికులకు పరిహారం చెల్లింపులోనూ ప్రభుత్వం వెనుకబడిందన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ఈనెల 30న నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆదిదంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపున అమ్మవారికి, స్వామి వారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ అధికంగా ఉండటంతో అన్ని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేశారు. మహా మండపం లిఫ్టు ద్వారా వచ్చే భక్తులకు 5వ అంతస్తు వద్ద నిలిపివేసి క్యూలైన్‌లోకి మళ్లించారు. మరో వైపున వీఐపీలకు, సిఫార్సు లేఖలపై వచ్చే వారికి సైతం అంతరాలయ దర్శనం నిలిపివేసి, బంగారు వాకిలి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం మహా నివేదన నేపథ్యంలో అన్ని దర్శనాలు అరగంట పాటు నిలిపివేశారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల రద్దీ మరింత పెరిగింది. ఆ తర్వాత దర్శనాలు తిరిగి ప్రారంభం కాగా సర్వ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు సూర్య భగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహిస్తామని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

అర్జున్ చక్రవర్తి అందరినీ ఆకట్టుకుంటుంది



మాట్లాడుతున్న అర్జున్ చక్రవర్తి చిత్రం హీరో విజయరామరాజు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 29న విడుదల కానున్న అర్జున్ చక్రవర్తి సినిమా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆ చిత్ర హీరో విజయరామరాజు అన్నారు. ఆరేళ్లపాటు శ్రమించి ఈ చిత్రాన్ని అద్భుతంగా తీశామని, ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో సినిమా యూనిట్ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విజయరామరాజు మాట్లాడుతూ అర్జున్ చక్రవర్తి కేవలం సినిమా మాత్రమే కాదనీ నా 9 ఏళ్ల కల అన్నారు. ఎంతో కష్టపడి, టీమ్ వర్క్‌గా ఈ సినిమాని పూర్తి చేశామని తెలిపారు. నిర్మాత మా పై పూర్తి విశ్వాసం ఉంచి, స్వేచ్ఛ ఇచ్చారన్నారు. ఈ చిత్రం తన కెరీర్‌కి టర్నింగ్ పాయింట్ అవుతుందని నమ్ముతున్నట్లు తెలిపారు. మైనస్ డిగ్రీ వాతావరణంలో షర్టు లేకుండా నటించానని, ప్రేక్షకులు తమ చిత్రాన్ని వీక్షించి ఆదరిస్తే కష్టానికి తగిన ఫలితం దక్కుతుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఐపీఎల్‌లో కబడ్డీ ఆడే క్రీడాకారులను ఈ చిత్రంలో తీసుకొని వారితో కబడ్డీ ఆడే సన్నివేశాలను తీశామని చెప్పారు. ఈ సమావేశంలో హీరోయిన్ సీజ రోజ్, నిర్మాత శ్రీని, నటుడు యోగానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, వి.సతీష్ పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ఉత్సవాల నిర్వహణ



సమావేశంలో ఉత్సవ సమితి సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభ, మతసామరస్యం వెల్లివిరిసేలా నిర్వహించాలని గణపతి నవరాత్రి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరాజు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పాకాల త్రినాథ్ రాజు తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో మండప నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండపాల విషయంలో వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామని చెప్పారు. సింగిల్ విండో ద్వారా అనుమతులకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. మండపాల్లో అసభ్య పాటలు, రాజకీయ అంశాలు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. సింగిల్ విండో విధానంలో సమస్యలు వస్తే సమితి పరిష్కరిస్తుందన్నారు. అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యదర్శి దుర్గాప్రసాద్ రాజు, త్రిమూర్తి రాజు మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం పరిశీలన తర్వాత ఎన్ఓసీ జారీ చేస్తుందన్నారు. ఉత్సవాలకు సంబంధించిన భక్తి గీతాలను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బిట్ర వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాసా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు రావి కృష్ణారావు, బాలకృష్ణ, సంజయ్ మెహతా, వల్లపు రాజా తదితరులు పాల్గొన్నారు.

జోరుగా విక్రయాలు



నగరంలోని నూజివీడు రోడ్డులో వినాయక విగ్రహాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వినాయక చవితి సమీపించడంతో పెద్ద సంఖ్యలో యువత, ఉత్సవ కమిటీ సభ్యులు వారికి నచ్చిన విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో విక్రయాలు బాగా జరుగుతున్నాయని విగ్రహాల విక్రయదారులు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులు అందుబాటులో ఉంచారు.

– మధురానగర్(విజయవాడ సెంట్రల్)





నగరంలో 'త్రిబాణధారి బార్బరిక్' సందడి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): త్రిబాణధారి బార్బరిక్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం గాంధీనగర్‌లోని రాజ్‌యువరాజ్ థియేటర్‌లో ప్రీమియర్ షో ఏర్పాటు చేశారు. ప్రీమియర్ షోకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాంకర్, నటి ఉదయభాను మాట్లాడుతూ త్రిబాణధారి బార్బరిక్ చిత్రం ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ చేస్తుందన్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఈనెల 29న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుందని తెలిపారు. అయితే ముందుగానే చిత్రానికి సంబంధించిన ప్రీమియర్ షోలు ఏర్పాటు చేసి ప్రేక్షకుల స్పందన తెలుసుకుంటున్నామని చెప్పారు. చూసిన ప్రతి ఒక్కరూ చిత్ర బాగుందని ప్రశంసలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమాలో సత్యరాజ్ నటన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని, ప్రతి సన్నివేశం ఉత్కంఠ భరితంగా ఉంటుందన్నారు. సకుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని వీక్షించవచ్చని తెలిపారు. అనంతరం నటుడు సత్యం రాజేష్ మాట్లాడుతూ చిత్రం ప్రమోషన్స్‌కు ప్రేక్షకుల నుంచి స్పందన బాగుందన్నారు. ఓ క్రైమ్ కథకు మైథాలజీ టచ్ యాడ్ చేస్తూ మోహన్ శ్రీవత్స అద్భుతంగా తీశారన్నారు. దర్శకుడు మోహన్ శ్రీవత్స మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. సమావేశంలో నిర్మాత విజయ్‌పాల్ రెడ్డి, నటులు మేఘన, క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా లేకపోవడమే జబ్బులకు కారణం



పటమట(విజయవాడతూర్పు): శరీరాన్ని కష్టపెడితేనే ఆరోగ్యంగా ఉంటామని, శరీరం విశ్వం, పంచభూతాత్మకం వీటిలో ఏది దగ్గినా అనారోగ్యానికి కారణమవుతుందని, తృప్తి, ఆనందం మనిషి ఆరోగ్యానికి ప్రధాన సూత్రాలని ప్రవచనకర్త రఘు అన్నారు. ఆదివారం పటమట వాసవ్య మహిళా మండలిలో సమభావన మిత్రమండలి 107వ సమావేశం జరిగింది. కోనేరు నరేంద్ర బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మన ఆదేశంలో 23 ధ్యాన విశేషాలు ఉన్నాయని, గతాన్ని వదిలేయడం, వర్తమానంలో ఉండటమే ధ్యానమని చెప్పారు. చేతి ఐదువేళ్లు పంచభూతాలకు ప్రతీకలని, కర్మల నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు. పోసే పెట్రోలును బట్టి బండి నడుస్తుందని, అలాగే తినే తిండిని బట్టి దేహం నడుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంవీరావు, టి. శోభనాద్రి, వై. రంగారావు, గుమ్మా సాంబశివరావు, సీహెచ్ వెంకటరెడ్డి, వై. శివాజీ, బి. వెంకటరావు, సుంకర నాగభూషణం, ఎం. అంజయ్య తదితరులు పాల్గొన్నారు.